సాక్షి
ములుగు

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



ఇక.. నో టెన్షన్

కాకతీయ యూనివర్సిటీలోని దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగుల వేతన వెతలు తీరనున్నాయి. వేతనాలు పెంచుతున్నట్లు వీసీ ప్రకటించారు.

- 8లో



కమలాపురం కన్నీటిపర్యంతం

శబరిమల దైవదర్శన యాత్రకు వెళ్లిన ముగ్గురు అయ్యప్ప భక్తులు నిర్జీవంగా ఇంటికి చేరడంతో కమలాపురం కన్నీటిపర్యంతమైంది.

- 8లో

గరిష్ఠం/కనిష్ఠం
27.0^0/14.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ సాధారణంగా ఉంటుంది. రాత్రికి చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చిట్యాల: కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎల్.విజయలక్ష్మి , డీఆర్‌డీఓ పురుషోత్తం అన్నారు. వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సంకల్ప యాత్ర సందేశాన్ని ప్రజలు తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు చేయూత ఇచ్చేందుకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, ఏపీజీవీబీ మేనేజర్ మధుసూదన్, ఎంపీఓ రామకృష్ణ, ఏఈఓ రమణకుమార్, ఏపీఎం మంజుల, మెడికల్ సూపర్‌వైజర్ సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి అనిత, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: కలెక్టర్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో డాటా అనలిస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు పోస్టుల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంసీఏ విద్యార్హత ఉండి ఇంగ్లిష్ భాష పావీణ్యం, టైపింగ్‌లో అనుభవం ఉండి ఆన్‌లైన్ అప్లికేషన్, రిపోర్ట్స్ తయారు చేసే విధానం తెలిసి ఉండాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల వారు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అదనపు ఎస్పీని కలిసిన ఐక్య వేదిక నాయకులు



భూపాలపల్లి రూరల్: ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన అదనపు ఎస్పీ నరేష్‌నాయక్‌ను ఐక్య వేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు అంగోతు తిరుపతి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు అజ్మీరా చంద్రనాయిక్, ఆయూబ్ ఖాన్, క్రాంతి నాయక్, వెంకటేష్, ప్రశాంత్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు (బుధవారం) ఉదయం 11 గంటలకు జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రూ.50 శాతం ఈఎండీ రూపంలో భూపాలపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వాహనాలను కొనుగోలు చేసినవారు జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలపై సీఐటీయూ పోరాటం

భూపాలపల్లి అర్బన్: కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఏరియాలోని కేటీకే 6వ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో గెలిచిన సంఘాలన్నీ కార్మికులకు ద్రోహం చేశాయని విమర్శించారు. కార్మికుల రక్షణ విషయంలో రక్షణ పరికరాలు అందించడంలో యజమాన్యం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆరోపించారు. కార్మికులు ఒక్కసారి ఆలోచించి సీఐటీయూను గెలించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన రూ.29వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి 250గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు కట్టుకోవడానికి రూ.30లక్షలు వడ్డీ లేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాతికోట ఉత్తర ద్వారం వద్ద మరమ్మతులు

ఖిలా వరంగల్: ఖిలావరంగల్‌లోని రాతికోట ఉత్తర ద్వారం వద్ద మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాతికోట శిథిలావస్థకు చేరడంతో అక్కడక్కడా కూలిపోతోంది. ఈ నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టగా మంగళవారం కేంద్ర పురావస్తుశాఖ అధికారి మడిపెల్లి మల్లేశం పర్యవేక్షించారు. కాగా, ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలికంగా కాకుండా శాశ్వత పనులు చేపట్టాలని చరిత్రకారులు కోరుతున్నారు.

కరోనాపై అప్రమత్తం



- శరవేగంగా వ్యాప్తి చెందుతున్న జేఎన్–1 వేరియంట్
- రక్షణ చర్యలు పాటించాలని సూచిస్తున్న వైద్యాధికారులు
- జిల్లాలో ఇప్పటి వరకు నమోదు కాని కేసులు

ములుగు: రెండేళ్లుగా ఊసే లేకుండా పోయిన కరోనా మళ్లీ విజృంభిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే మూడు వేవ్‌లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ముఖ్యంగా రెండో వేవ్‌లో ములుగు జిల్లాలో 65కు పైగా మంది మృతి చెందారు. తాజాగా కేరళలో మరో కొత్త వేరియంట్ జేఎన్–1 బీఏ -2.86 ఉప జాతిరకం కరోనా కేసుల సంఖ్య పెరగడంతో పాటు వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లుగా తెలుస్తోంది. శీతాకాలంలో ఈ వేరియంట్ ద్వారా ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు కరోనా లక్షణాలు లేకపోవడం ఒకింత సంతోషకరం. అయినప్పటికీ బయటి రాష్ట్రాల్లో వ్యాపారాలు, ఉద్యోగాలు, పర్యాటకానికి వెళ్లి వచ్చే వారి నుంచి కరోనా వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖ భావిస్తుంది. ఈ క్రమంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కాగానే గ్రామాల వారీగా వైద్య సిబ్బంది తరపున నూతన వేరియంట్, తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు.



ఎంజీఎంలో కరోనా వైద్య సేవల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మళ్లీ మాస్కులు, శానిటైజర్లు వాడాల్సిందే..

కరోనా నూతన వేరియంట్ వ్యాప్తి చెందకుండా ప్రజలు మళ్లీ మాస్కులు, శానిటైజర్లు వినియోగించడం పరిపాటిగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలైనప్పటి నుంచి కిక్కిరిసి పోతున్నాయి. కొంత మంది ఒంటి కాలిపై నిలబడి ప్రయాణించాల్సి పరిస్థితి ఎదురైంది. ఇంత రద్దీలో కరోనా వేరియంట్ స్పీడ్‌గా వ్యాప్తి చెందేలా ఉందని పలువురు భావిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే వ్యాపారులు పక్కన పెట్టిన మాస్కులు, శానిటైజర్లను అమ్మకానికి పెడుతున్నారు. ప్రజలకు ఫ్రీగా అందించేందుకు గ్రామాల్లోని సబ్ సెంటర్లకు వైద్యశాఖ తరపున అందించనున్నారని సమాచారం.

మేడారంపై ప్రభావం చూపేనా?

వచ్చే ఏడాది(2024) ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మేడారం సమ్మక్క–సారలమ్మల మహాజాతర జరగనుంది. జాతర కంటే 20 రోజుల ముందు నుంచే భక్తుల సంఖ్య పెరుగుతూ రావడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో పాటు మహాజాతర జరిగే నాలుగు రోజుల్లో పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. వారిలో ఏ ఒక్కరికి కరోనా సోకినా రద్దీగా ఉండే జాతర సమయంలో మిగతా వారికి సోకే ప్రమాదం ఉంటుంది. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటే కరోనా నూతన వేరియంట్ నియంత్రణకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో కరోనా విస్తృతంగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని వైద్యులు, అనుభవజ్ఞులు చెబుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి



దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. అవసరమైతే తప్ప బయటకు రాకూడదు. ముఖ్యంగా టీబీ.ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులతో ఉన్నవారు తప్పకుండా మాస్కు ధరించాలి. చిన్నారులు, వృద్ధుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. పౌష్టికాహారం తీసుకోవాలి. కేరళ నుంచి వచ్చే వారి పట్ల జాగ్రత్త వహించాలి. ఏక్షణమైనా నూతన వేరియంట్ వ్యాపించే అవకాశం ఉంది. రద్దీ ప్రదేశాల్లో సాధ్యమైనంత వరకు తిరగకుండా చూసుకోవాలి. జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలు ఉన్న వారు సమీప ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకోవాలి.

- డాక్టర్ పోరిక రవీందర్, జిల్లా టీబీ, లెప్రసీ నియంత్రణ అధికారి

ఎంజీఎంలో ప్రత్యేకవార్డు

ఎంజీఎం : కరోనా మహమ్మారి మరోసారి పంజా విసురుతోంది. కొత్త వేరియంట్ జేఎన్–1 వైరస్ వ్యాపిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సైతం అప్రమత్తమైంది. ఈ క్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జలుబు, జ్వరం, దగ్గు వంటి ఫ్లూ లక్షణాలతో బాధపడేవారికి జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్ యాంటీజెన్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించాలని ఇప్పటికే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పీహెచ్‌సీల వైద్యాధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని, చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోనూ ప్రత్యేక పడకలు ఏర్పాటు చేశారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా..

ఉత్తర తెలంగాణ జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో కరోనా వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఒక వేళ వ్యాధి వ్యాప్తి జరి గినా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఎంజీఎం ఆర్‌ఎంఓ డాక్టర్ మురళి తెలిపారు. ఆస్పత్రిలో ఎలాంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం 10 వెంటిలేటర్లు, 30 ఆక్సిజన్ పడకలు, 10 సాధారణ పడకలతో మొత్తం 50 పడకలను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ వార్డుల్లో ప్రత్యేక వైద్యసిబ్బంది, వైద్యాధికారులు విధులు నిర్వర్తించనున్నట్లు డాక్టర్ మురళి పేర్కొన్నారు.

ఎలాంటి కేసులు నమోదు కాలేదు..

ఎంజీఎం ఆస్పత్రితోపాటు హనుమకొండ జిల్లా పరిధిలో ఎలాంటి కేసులు నమోదు కాలేదని అధికారులు పేర్కొన్నారు. కొత్త వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్న క్రమంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ములుగు రూరల్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నెబోయిన సారయ్యయాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో డీవైఎస్‌ఓ వెంకయ్య ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భాదం ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడిగా పోరిక అశోక్ కుమార్, ఉపాధ్యక్షులుగా సంగ రంజిత్, సుంకరి సహదేవ్, రావులపల్లి శ్రీదర్, ప్రధాన కార్యదర్శిగా పోరిక హస్సిలాల్, ప్రచార కార్యకదర్శిగా జీ విష్ణు, సంయుక్త కార్యదర్శులుగా ఎట్టి భూషణం, జక్కుల రేవంత్‌యాదవ్, చిలపాక ఆనంద్, కోశాధికారిగా పోరిక మోహన్‌లాల్, సలహాదారులుగా సంగ చేరాలు, బల్గూరి వేణు, కార్యవర్గ సభ్యులుగా రమేష్, నరేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఈటీలు మల్లయ్య, మాధవిలు పాల్గొన్నారు.

23న శ్రీమద్భగవద్గీత శ్లోక పఠన పోటీలు

హన్మకొండ కల్చరల్ : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ వరంగల్ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకొని ఈ నెల 23వ తేదీన హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహిస్తున్నామని టీటీడీ డీపీపీ ప్రోగ్రాం ఆఫీసర్ రామిరెడ్డి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు భగవద్గీత మూడవ అధ్యాయం కర్మ సన్యాస యోగంలోని ఒకటి నుంచి 30 శ్లోకాలను కంఠస్థం చేసి చదవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 6, 7 తరగతి విద్యార్థులను ఒక విభాగంగా, 8, 9 తరగతి విద్యార్థులను రెండవ విభాగంగా అనుమతిస్తారని తెలిపారు. 18సంవత్సరాల లోపు, పైబడిన వయస్సు వారిని గ్రూపులుగా విభజించి సంపూర్ణ భగవద్గీత మీద పోటీలు నిర్వహిస్తున్నామని, వివరాల కోసం 94417 90725 సెల్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు. ప్రతి విభాగంలోనూ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

లక్నవరం చెరువు తైబందీ ఖరారు

గోవిందరావుపేట: మండల పరిధిలోని బస్సాపూర్ శివారులోని లక్నవరం చెరువు యాసంగి సాగు తైబందీని ఖరారు చేసినట్లు నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సాగుకు రొటేషన్ విధానం ప్రకారం ఈ ఏడాది కోట కాలువతో పాటు రాంపూర్ కాల్వలకు సుమారు 1900 ఎకరాలకు నీరు అందించేందుకు అధికారులు తీర్మానించినట్లు పేర్కొన్నారు. మేడారం మహాజాతర సందర్భంగా నీరు వృథా కాకుండా ఈ కాల్వలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, డీఈ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి జితేందర్, ఏఈ క్రాంతి కుమార్, ఉపేందర్‌రెడ్డి, అర్షద్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాస్

ఉపకార వేతనాలు మంజూరు చేయాలి

ఏటూరునాగారం: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలను, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, జిల్లా కార్యదర్శి రవిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన డివిజన్ మహాసభ కమిటీ రవితేజ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సందర్భంగా కిరణ్, రవి హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 50వేల 117 కోట్ల ఉపకార వేతనాలు రాక పేద విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నార న్నారు.దీంతో కొంతమంది చదువులకు దూరం అవుతున్నారని వివరించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా కొరస వంశీ, కార్యదర్శిగా జాటి రవితేజ, ఉపాధ్యక్షుడు బట్ట స్వామి, సహాయ కార్యదర్శి కావేరి బైరేష్, ఉపాధ్యక్షులు సోడి అశోక్, సహాయ కార్యదర్శి కోయిల బాలు, డివిజన్ కమిటీ సభ్యులు మందపల్లి స్వామి, ముక్కెర ధనూష్, జాడ యుగేందర్, వంకాయల సిద్ధు, వాసంపల్లి గణేష్, దుర్గం యుగేందర్, నూతన కమిటీ ఎన్నికయ్యారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

ఆదివాసీ ఎమ్మెల్యేకే గిరిజన శాఖ ఇవ్వాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి : ఆదివాసీ ఎమ్మెల్యేకే గిరిజన సంక్షేమ శాఖ కేటాయించాలని ఐక్య ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మేడారంలోని ఐటీడీఏ అతిథిగృహం ఆవరణంలో మంగళవారం ఐక్య ఆదివాసీ సంఘాల నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి తీర్మానం పత్రం పంపించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణలో ఆదిమ తెగలకు గిరిజన సంక్షేమ శాఖ కేటాయించ లేదన్నారు. ప్రతి సారి ఆదిమ తెగలు కాంగ్రెస్ పార్టీ వెన్నంటే ఉన్నాయనే వాస్తవాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించాలన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదిమ తెగలకు గిరిజన సంక్షేమ శాఖను కేటాయించడం వల్ల అడవి బిడ్డలకు న్యాయం జరుగుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ నాయకులు పొడెం రత్నం, కొప్పుల రవి, చింత కృష్ణ, ఆదివాసీ సేన నాయకులు మడివి సాయిబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు శంకర్, ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు నరసింహమూర్తి, వాసం నాగరాజు, ముద్దబోయిన రవి, సర్పంచ్ చిడెం బాబురావు, నాయకపోడు, ఆదివాసీ మహిళా సంఘాలు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న సంఘాల నాయకులు

సీపీని కలిసిన ఐఎంఏ కార్యవర్గం

ఎంజీఎం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ప్రజలకు, సమాజానికి మెరుగైన సేవలు అందించేలా చూడాలని సూచించారు. వైద్యుల రక్షణ పట్ల పోలీస్‌శాఖ నిత్యం అప్రమత్తంగా ఉంటుందని పేర్కొన్నారు. సీపీ కలిసిన వారిలో ఐఎంఏ నూతన అధ్యక్షుడు డాక్టర్ ఎండీ అన్వర్, కార్యదర్శి బింగి శ్రీనివాస్, కోశాధికారి శ్రవణ్, ఉపాధ్యక్షులు వెంకటస్వామి, అజిత్ మహ్మమద్ పాల్గొన్నారు.

సంక్రాంతిలోగా పనులు పూర్తి చేయాలి

- ప్లాస్టిక్ రహిత మేడారం జాతర లక్ష్యం
- అధికారులు, గిరిజన సంఘాలతో కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న శాశ్వత పనులన్నీ సంక్రాంతి పండుగ లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల పరిధిలోని మేడారం ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్‌తో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత శాఖ అధికారులు, గిరిజన సంఘాలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేడారంలో పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. విధులు కేటాయించబడిన ఏఈ, డీఈలు మేడారంలోనే ఉండి పనులు చేపట్టాలన్నారు. ఈఈలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సందర్శించి పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. ప్రతీ శాఖకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చూసి పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీశాఖ డీఈ, ఏఈలు చేపడుతున్న పనుల పురోగతికి సంబంధించిన ఫొటోలు గ్రూపులో పోస్టు చేయాలన్నారు. మేడారం జాతరకు సుమారు కోటి యాభై లక్షల మంది భక్తులు రానున్నట్లుగా అంచనా ఉన్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత మేడారానికి ప్రణాళికతో ముందుకు..

ప్లాస్టిక్ రహిత మేడారం జాతర సాగేలా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లుగా కలెక్టర్ వివరించారు. వన దేవతల పండుగ, వనంలో పండుగ, పక్కనే వన్య ప్రాణులు ఉన్నాయి కాబట్టి వనాన్ని, వనంలోని ప్రాణులను కాపాడుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ములుగు, మేడారంలో వ్యాపారులకు ప్లాస్టిక్ నిర్వహణపై ముందుగానే అవగాహన కల్పించాలని, ముందే ప్రత్యామ్నాయ వస్తువుల వివరాలను తెలుపేందుకు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మేడారం భూమిలో ఒక్క ప్లాస్టిక్ ముక్క పడకుండా చూసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివాసీల పండుగ, సాంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రపంచానికి మేడారం గురించి చాటి చెప్పేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ చిలకలగుట్ట నుంచి ఊరట్టం మార్గమధ్యలో పార్కింగ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు.ఈ సమావేశంలో డీఎస్పీ రవీందర్, ఈఓ రాజేంద్రం, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, డీపీఓ వెంకయ్య, డీఎంహెచ్ఓ అప్పయ్య, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన పీఓ

మేడారంలో ఐటీడీఏ పీఓ అంకిత్ పర్యటించారు. నీటిపారుదల ప్రతిపాదిత పనులపై సంబంధిత అధికారులతో కలిసి జాతరలో చేపట్టనున్న ఏర్పాట్లను పరిశీలించారు. గిరిజన మ్యూజియంను సందర్శించారు. మ్యూజియం ఆవరణలో గ్రౌండ్ లెవలింగ్ పనులతో పాటు మ్యూజియంలో వస్తువులు, నిర్మాణ పనులు ఏమైనా ఉంటే వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారిని ఆదేశించారు. మ్యూజియం పక్కన ఆదివాసీల ఇలవేల్పుల జాతర నిర్వహణకు స్థలాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తదానుగుణంగా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అనంతరం మ్యూజియం పక్కనే ఉన్న హంపీ థియేటర్‌ను పరిశీలించి సరిపడా లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. జంపన్నవాగు, రెడ్డిగూడెం వైపు, చిలుకలగుట్ట వైపు ఉన్న స్నాన ఘట్టాల మరమ్మతులు, క్రాస్ బండ్‌ల ఏర్పాటు, ఇసుక తొలగింపు, పాత ఇంకుడు గుంతల తొలగింపు, మహిళలు దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం తదితర ప్రతిపాదిత పనులను పరిశీలించారు. చిలుకలగుట్ట కాంపౌండ్ వాల్‌పై పెయింటింగ్ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఎస్‌ఓ రాజుకుమార్, ట్రైబల్ వెల్ఫేర్ డీఈ చందర్, ఏఈ నారాయణ, ఇరిగేషన్ డీఈ సదయ్య పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఎన్నికలు నిర్వహించాల్సిందే..

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను ఈ నెల 27న నిర్వహించాల్సిందేనని ఐఎన్‌టీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుచ్చయ్య మాట్లాడారు. ఇప్పటికే మూడు సార్లు ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు కూడా సంబంధిత అధికారులు ఇప్పటికే పూర్తిచేశారని తెలిపారు. ఐఎన్‌టీయూసీ వాయిదా వేయాలని చూస్తోందని కొన్ని యూనియన్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐఎన్‌టీయూసీకి ఎన్నికలు వాయిదా వేయించాల్సిన అవసరం లేదన్నారు. ఐఎన్‌టీయూసీని ఎదుర్కొనే శక్తి ఏ సంఘానికీ లేదని చెప్పారు. ఇతర సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీగా తమ యూనియన్‌లో చేరుతున్నట్లు తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు, యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులకు ఆరు గ్యారెంటీలతో ఎన్నికల ముందుకు వచ్చిందన్నారు. వివిధ సంఘాల నాయకులు అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పసునూటి రాజేందర్, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తులను పారదర్శకంగా నమోదు చేయాలి

ములుగు రూరల్/వెంకటాపురం(కె)/ కన్నాయిగూడెం: మీసేవ కేంద్రాలకు వచ్చే అర్జీదారుల దరఖాస్తులను పారదర్శకంగా నమోదు చేయాలని జిల్లా ఈ -డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ అన్నారు. జిల్లా పరిధిలోని మంగళవారం ఆయన వెంకటాపురం(కె), కన్నాయిగూడెం మండలాల పరిధిలోని పలు మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ములుగు మండల పరిధిలోని మల్లంపల్లిలో గల మీ సేవ కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మల్లంపల్లిలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, వయోవృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఆయన మల్లంపల్లిలో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పొలజు విజయ్, మీ సేవ నిర్వాహకులు చిట్యాల రాజు, సాయి ప్రకాశ్, చక్రి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వెంకటాపురం(కె)మండల పరిధిలోని ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని ఈ -డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీసేవ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. మీ సేవ కేంద్రాల వద్ద ప్రజలు పడుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఆధార్ నమోదు కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కన్నాయిగూడెం మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాన్ని ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మీసేవ కేంద్రాల్లో అధిక ధరలు వసూలు చేయొద్దని హెచ్చరించారు. మీ సేవ కేంద్రాల్లో అందుతున్న సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జిల్లా మేనేజర్ పోలాజు విజయ్, మీసేవ నిర్వాహకులు చిట్యాల రాజు, చిడెం సాయి ప్రకాశ్, చక్రి పాల్గొన్నారు.



కన్నాయిగూడెం:ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విజయ హత్య కేసులో పోలీసుల పురోగతి

● సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రత్యేక దృష్టి

కాజీపేట: కాజీపేట పట్టణంలో ఇటీవల దారుణ హత్యకు గురైన విజయ కేసులో పోలీసులు పురోగతి సాధిస్తున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఏసీపీ డేవిడ్ రాజ్, సీఐ రాజు వివిధ పోలీసు విభాగాల సిబ్బందితో కలిసి హత్య చేసిన దుండగులను గుర్తించే పనిలో బిజీగా మారారు. ఇప్పటికే ఈ కేసుతో సంబంధం ఉందనే అనుమానం ఉన్న పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితులు పకడ్బందీగా వ్యవహరించి సాక్ష్యాలు లభించకుండా చేసినా సాంకేతిక పరిజ్ఞానంతో వారిని పట్టుకోవడానికి పోలీసులు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా హత్య జరిగిన రోజు నుంచి రహమత్ నగర్ కాలనీలోనే ఉంటూ సాక్ష్యాల సేకరణలో నిమగ్నమయ్యాయి. ఒకటి, రెండ్రోజుల్లో కేసును చేధించి నిందితులను అరెస్టు చేయొచ్చనే ప్రచారం సాగుతోంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● రూ. 7 లక్షల నగదు అపహరణ

తొర్రూరు: తొర్రూరు పట్టణంలోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై రాంజీ నాయక్ కథనం ప్రకారం.. పట్టణంలోని 1వ వార్డులో నివాసముండే మాజేటి సూర్యారావు దంపతులు సోమవారం సాయంత్రం బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి అదే రోజు రాత్రి ఇంటికి రాగా తాళం పగులగొట్టి కనిపించింది. దీంతో అనుమా నం వచ్చి ఇంట్లోకి వెళ్లి బీరువాలో చూడగా అందులో భద్రపరిచిన రూ.7 లక్షల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన బాధితుడు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సీఐ సత్యనారాయణ, క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించింది. బాధితుడి భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మంగళవారం తెలిపారు.

'అద్దె బస్సుల భవిష్యత్ అగమ్యగోచరం'

హన్మకొండ : టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో అద్దె బస్సు యజమానుల భవిష్యత్ అగమ్యగోచరంగా ఉందని ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హనుమకొండలో అద్దె బస్సుల యజమానుల సమావేశం నిర్వహించారు. రీజియన్‌లో సంస్థకు చెందిన పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు అద్దె బస్సులతో పోలిస్తే తక్కువగా ఉన్నాయన్నారు. దీంతో ప్రస్తుతం ప్రయాణికుల భారం అద్దె బస్సులపై పడిందన్నారు. ఈ సమావేశంలో రాంరెడ్డి మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం ప్రారంభించినప్పటి నుంచి ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, ప్రతి బస్సులో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో టికెట్ ఇష్యూతో పాటు, బస్సును ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండడంతో నిర్ణీత సమయానికంటే రెండు, మూడు గంటలు ఆలస్యంగా నడుస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్స్‌ప్రెస్‌ను 400 కిలో మీటర్లు, పల్లెవెలుగు బస్సులను 300 కిలో మీటర్ల వరకు మాత్రమే నడపాలని, పరిమితి మించి ప్రయాణికులుంటే బీమా క్లెయిమ్ సమస్య వచ్చే అవకాశముందన్నారు. తమ సమస్యలపై యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలని కోరారు. అద్దె బస్సుల యజమానులు ఆర్.రాంబాబు, ఎన్. నారాయణ రెడ్డి, హబీబుద్దీన్, బి.రాజు, బి.లింగారెడ్డి, కర్ణాకర్ పాల్గొన్నారు.

ఇక.. నో టెన్షన్

దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగుల వేతనాల పెంపు


మాట్లాడుతున్న వీసీ రమేష్


సమావేశానికి హాజరైన ఉద్యోగులు

● ప్రకటించిన కాకతీయ యూనివర్సిటీ వీసీ రమేష్
● 507 మందికి ప్రయోజనం
● ఉద్యోగుల వేతన వెతలు తీరినట్లేనా !
● ఆర్డర్ కాపీని బయటపెట్టకపోవడంలో ఆంతర్యమేమిటో
● ఎంప్లాయిస్‌లో చర్చ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగుల వేతన వెతలు తీరనున్నాయి. చాలీచాలని జీతంతో విధులు నిర్వర్తిస్తున్న వీరు.. ఆరేళ్లుగా తమ వేతనాలు పెంపుదల చేయాలని యూనివర్సిటీ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. అంతేకాకుండా ఆందోళనలు కూడా చేస్తూ వచ్చారు. గతంలో రెగ్యులర్, టైంస్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు పెరగగా పలు కారణాలతో వీరికి పెరగలేదు. దీంతో తమకు కూడా 30 శాతం పెంపుదల చేయాలని కొన్నేళ్లుగా కోరుతూ వస్తున్నారు. దీనికి వీసీ రమేష్ కూడా పలుమార్లు పెంచుతామని చెబుతూనే జాప్యం చేశారు. దీంతో ఇటీవల జరిగిన ఎన్నికల ముందు కూడా ఆయా ఉద్యోగులు తమ వేతనాలు పెంపుదల చేయాలని కోరారు. దీనికి స్పందించిన వీసీ రమేష్.. అసెంబ్లీ ఎన్నికల తరువాత పెంపుదల చేస్తామని ఆయా ఉద్యోగ సంఘాల బాధ్యులకు హామీ ఇచ్చారు.

వీసీని కలిసిన ఉద్యోగ సంఘాల బాధ్యులు

రాష్ట్రంలో ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఇప్పటికైనా దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు వేతనాలు పెంపుదల చేయాలని ఉద్యోగ సంఘాల బాధ్యులు ఈనెల 18న వీసీ రమేష్‌ను కోరారు. దీనికి స్పందించిన వీసీ.. 'ఈనెల 19న సమావేశం నిర్వహించండి.. నేను వచ్చి అక్కడే వేతనాల పెంపు విషయం ప్రకటిస్తా' ననే విషయం ఉద్యోగ సంఘాల బాధ్యులకు చెప్పారని సమాచారం.

వేతనాలు పెంచినట్లు ప్రకటించిన వీసీ రమేష్

కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీసీ రమేష్ మాట్లాడుతూ దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు వేతనాలు పెంచామని తెలిపారు. వీరి వేతనాల పెంపుదలకు ఉన్నతాధికారులను ఒప్పించడానికి ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయని వెల్లడించారు. వేతనాల పెంపునకు సంబంధించిన ఆర్డర్ కాపీని వేదికమీదనుంచే ఉద్యోగులకు చూపారు. దీంతో సంబంధిత ఆర్డర్ కాపీ ఇవ్వాలని ఆయా ఉద్యోగసంఘాల బాధ్యులు కోరారు. కాని తాను ఇప్పుడు దీనిని బయటికి ఇవ్వబోమనని స్పష్టం చేశారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల వేతనాల పెంపుదలకు వీసీ రమేష్ ఎంతో కష్టపడ్డారని చెప్పారు. ఉద్యోగ సంఘాల బాధ్యులు డాక్టర్ పి విష్ణువర్ధన్, శివప్రసాద్, రాజమౌళి, శాగంటి శ్రీనివాస్ ఆర్ సురేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆరేళ్లుగా వేతనాల పెంపుదల జరగలేదన్నారు. ప్రస్తుతం పెంచారని, దీనికి కృషి చేసిన వీసీ, రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, వేతన పెంపు ఆర్డర్ కాపీ ఇవ్వకపోవడంపై యూనివర్సిటీ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.

ఉద్యోగులకు మూడు కేటగిరీలుగా వేతనాలు పెంపుదల

కాకతీయ యూనివర్సిటీలోని దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు మూడు కేటగిరీలుగా విభజించి వేతనాలు పెంపుదల చేశారు. ఇప్పటివరకు లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులు రూ. 6వేలు, 7వేలు , 8వేలు ఇలా వారి సర్వీస్‌ను బట్టి చెల్లిస్తున్నారు. ఇక నుంచి వీరికి రూ. 15,600 వేతనం రానుంది. ఆయా ఉద్యోగుల్లో డిగ్రీ, ఆపై విద్యార్హతలు ఉంటే ఇప్పటికే టేబుల్ వర్క్ కాని కంప్యూటర్ వర్క్ చేస్తున్నవారికి ఇక నుంచి రూ.19,500 వేతనం రానుంది. వీరిని ఇక నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించబోతున్నట్లు వీసీ వెల్లడించారని ఉద్యోగసంఘం నాయకులు తెలిపారు. దినసరివేతన ఉద్యోగులకు ఇప్పటికే రూ. 20వేలకుపైగా వేతనాలు చెల్లిస్తున్నారు. అయితే ఇప్పుడు రూ. 22వేల 750కి పెంపుదల చేశారు. మొత్తానికి కేయూలో ఆయా కేటగిరీలకు చెందిన 507 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది.

పెంచిన వేతనాలు అమలుచేయాలి



కాకతీయ యూనివర్సిటీలోని దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు వేతనాలు పెంచడం ఆనందంగా ఉంది. దీనికి కృషి చేసిన వీసీ, రిజిస్ట్రార్‌కు ధన్యవాదాలు. డిసెంబర్ వేతనం జనవరి మొదటివారంలో ఇస్తారు. ఈ నేపథ్యంలో పెరిగిన వేతనం కలిపి ఇవ్వాలి. ఆర్డర్ కాపీ కూడా ఇవ్వాలి.

-శివ ప్రసాద్, కేయూ డైలీవైజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

'పట్టు' పెంపకం, మల్బరీ సాగుతో అధిక లాభం

● పట్టుపరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ అనసూయ


మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ అనసూయ

ఎల్కతుర్తి: పట్టు పురుగుల పెంపకం, మల్బరీ సాగుతో అధిక లాభాలు పొందొచ్చని పట్టుపరిశ్రమశాఖ జాయింట్ డైరెక్టర్ అనసూయ తెలిపారు. మండల కేంద్రంలోని పట్టుపరిశ్రమ కార్యాలయంలో మంగళవారం పట్టు పురుగుల పెంపకం, మల్బరీ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అనసూయ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మల్బరీ పంట సాగులో చీడపీడల బెడద ఉండదన్నారు. పట్టుపురుగుల పెంపకంతో అధిక దిగుబడులు పొందొచ్చన్నారు. మల్బరీని ఒక్కసారి సాగు చేస్తే 10 సంవత్సరాల వరకు పంట ఉంటుందన్నారు. పట్టుపురుగుల పెంపకం ద్వారా సంవత్సరానికి 6 నుంచి 8 పంటలు తీసుకోవచ్చన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సైంటిస్టు దయాకర్‌రావు, రాఘవేంద్రర్, సారంగపాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

నాట్యకళలు తెలుగు సంస్కృతికి ఊపిరి

● నేడు శివానందమూర్తి జయంతి వేడుకలు


మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వర్‌రావు


నృత్యం చేస్తున్న కళాకారులు

వరంగల్ : జానపదం, పేరిణి, భరత నాట్య కళలు తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ఊపిరి అని శివానంద గురు కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బలుసపాడు చైర్మన్ చిట్టినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువు కందుకూరి శివానంద మూర్తి జయంతి ఉత్సవాల సందర్భంగా ములుగు రోడ్డులోని సప్త గురుధామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సంగీత, నృత్య పోటీల మూడో రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వరంగల్ శివానంద కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచందర్ మాట్లాడుతూ.. ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఈ పోటీలకు మంచి స్పందన వచ్చిందని, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రెండు వందల మంది పిల్లలు పాల్గొన్నారని తెలిపారు. మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూ పూజ్య గురువులు సంగీత, నృత్య కళలను ప్రోత్సహించేందుకు ఆంధ్ర మ్యూజిక్ అకాడమీ స్థాపించి ప్రతి ఏటా అన్ని జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రతి కళలలో నిష్ణాతులకు రూ.లక్ష నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రాన్ని ఇచ్చి సన్మానం చేస్తామన్నారు. నేడు జరగబోయే శివానందమూర్తి జయంతి ఉత్సవాలకు దేశ విదేశాల నుండి సుమారు 2,000 మంది కార్యకర్తలు వస్తారని, భక్తులు అధిక సంఖ్యలో రావాలని, అందరికీ భోజన సదుపాయం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి సుధీర్‌రావు, పేరిణి రంజిత్‌కుమార్, లాయక్ అహ్మద్, గందె ఉమాశంకర్, సోమరామయ్య, రాంరెడ్డి, మాదారపు సదాశివుడు నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బెడ్డింగ్ దిగుమతి రేట్లు పెంచాలి

● 29నుంచి నిరవధిక సమ్మె
● కలెక్టరేట్ ఎదుట హమాలీ కార్మికుల ధర్నా


వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా ఎఫ్‌సీఐ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల బెడ్డింగ్ దిగుమతి రేట్లు పెంచాలి.. మిల్లు యజమానులతో చర్చించి తమకు న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ డిమాండ్ చేశారు. వరంగల్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట మంగళవారం జిల్లా మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం లేబర్ అధికారుల సమక్షంలో మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కార్మిక సంఘాల యూనియన్ ప్రతినిధులు చర్చించి దిగుమతి కూలీ రేట్లు రూ.4,700 ఇచ్చేందుకు ఒప్పందం చేశారన్నారు. రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మళ్లీ రేట్లు పెంచేందుకు యజమానులతో మాట్లాడితే వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కుటుంబ అవసరాలు, ఖర్చులు పెరిగిన దృష్ట్యా రేట్ల పెంపుదలకు యజమానులు అంగీకరించక పోవడంతో ఈనెల 29వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నామని యూనియన్ నాయకులు తెలిపారు. అనంతరం యూనియన్ నాయకులు వరంగల్ ఆర్డీఓ వాసుచంద్రకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. నాయకులు మందాటి శ్రీనివాస్, జి.రమేష్, ఎం.నర్సయ్య, సాజిద్, సాయిలు, టి.రాజేష్, బి.కుమార్, ఆర్.రాజు, జి.గణేష్, ఏఐకేఎంఎస్ నాయకులు రాచర్ల బాలరాజు, పీవైఎల్ జిల్లా నాయకులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

● ఇద్దరి నిందితుల రిమాండ్
● వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్


నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్, సిబ్బంది

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్ పరిసరాల్లో మండల ఎక్సైజ్ శాఖ, ఎస్‌టీఎఫ్ హైదరాబాద్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో 22 కిలోల ఎండు గంజాయి లభ్యంకాగా స్వాధీనం చేసుకున్నారు. ఖిలావరంగల్ ఎక్సైజ్ సీఐ చంద్ర మోహన్ కథనం ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం వరంగల్ శివనగర్ పరిసరాల్లో అనుమానాస్పదంగా కనిపించిన ఒడిశాకు చెందిన సీమాకుమార్, దూలి శంకర్ బ్యాగులు పరిశీలించారు. ఇందులో 22 కేజీల ఎండు గంజాయి, రూ.2 వేల నగదు, రెండు స్మార్ట్‌ఫోన్లు లభించాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై సరిత, బి శివ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి జోన్ మీట్ క్రీడలు

● మూడు రోజుల పాటు పోటీలు

ఏటూరునాగారం : ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న క్రీడాకారులకు ఆటలపోటీలు నిర్వహించనున్నారు. నేడు(బుధవారం) నుంచి 22వ తేదీ వరకు జోన్ మీట్ క్రీడలను నిర్వహించడానికి ఐటీడీఏ గిరిజన పాఠశాలల స్పోర్ట్స్ ఆఫీసర్లు సన్నద్ధమయ్యారు. ఐటీడీఏ పీఓ అంకిత్ ఆధ్వర్యంలో ఈపోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎనిమిది డివిజన్లు

కరీంనగర్‌లోని కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి కలిపి ఒక డివిజన్‌గా పలు ఆశ్రమ పాఠశాలు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం, ములుగు, వాజేడు, భూపాలపల్లి, హనుమకొండ, మహబూబాబాద్, కొత్తగూడ, వెంకటాపురం(కె) ప్రాంతాలను ఎనిమిది డివిజన్‌గా విభజించారు. ఒక్కో డివిజన్ నుంచి 240 చొప్పున 1,920 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడనున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

● ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

హసన్‌పర్తి : నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్–కాలేజియేట్ అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పింగిలి రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓటమి స్ఫూర్తితో గెలుపునకు ప్రయత్నించాలన్నారు. ఈసందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో కేయూ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకన్న, కళాశాల పీడీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ భాస్కర్, బి.ప్రభాకర్, ప్రవంతి, పీఆర్వో ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

పురుషుల చాంపియన్: ప్రభుత్వ ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్ (ఖమ్మం)
మహిళల చాంపియన్: ఎస్‌సీడీసీ(కొత్తగూడెం)
బెస్ట్అథ్లెట్ (మహిళా విభాగం): ఎ.మైథిలి (ప్రభుత్వ ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్ ఖమ్మం)
బెస్ట్ అథ్లెట్(పురుషుల విభాగం): ఎ.గౌత్ (కేఎండీసీ ఖమ్మం) నిలిచారు.

అంత్యక్రియలకు వెళ్తొస్తూ అనంతలోకాలకు..

● బైక్‌ను ఢీకొన్న టిప్పర్
● భార్య అక్కడికక్కడే మృతి, భర్తకు తీవ్రగాయాలు
● భాగ్యనగర్ సమీపంలో ఘటన

సంగెం: బంధువు అంత్యక్రియలకు హాజరైన దంపతులు.. కార్యక్రమం ముగిసిన అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మృత్యువు టిప్పర్ రూపంలో వచ్చి ఢీకొంది. దీంతో భార్య అనంతలోకాలకు వెళ్లగా.. భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సంగెం మండలంలోని భాగ్యనగర్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన పెద్దపల్లి పద్మ అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం పద్మ అంత్యక్రియలకు బంధువులైన పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామానికి చెందిన నాంపెల్లి రమ(47), మల్లేశం దంపతులు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ద్విచక్రవాహనంపై స్వగ్రామం బయలుదేరారు. మార్గమధ్యలో భాగ్యనగర్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్.. బైక్‌ను ఢీకొంది. దీంతో రమ అక్కడిక్కడే మృతి చెందగా మల్లేశంకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో మల్లేశంను ఎంజీఎం తరలించారు. కాగా, ఘటన జరిగిన అనంతరం టిప్పర్ డ్రైవర్ పరారైనట్లు సమీప చేలల్లో పనిచేస్తున్న కూలీలు చెప్పారు. దీనిపై సమాచారం అందుకున్న పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు, సంగెం ఏఎస్సై జయపాల్‌రావు, సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని రమ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా, టిప్పర్ కోసం కాపులకనిపర్తి, గవిచర్ల, తీగరాజుపల్లి గ్రామాల్లోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.


రమ (ఫైల్)

బైక్‌లు ఢీ..
కుమారుడి మృతి, తండ్రికి తీవ్రగాయాలు

లింగాలఘణపురం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కుమారుడు దుర్మరణం చెందగా తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. మరో యువకుడికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం జనగామ, సూర్యాపేట రోడ్డులో నవాబుపేట సమీపంలోని రైస్‌మిల్లు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన కారుపోతుల సుధాకర్, తన కుమారుడు వంశీ (26) బైక్‌పై జనగామ నుంచి దేవరుప్పులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నవాబుపేట రైస్‌మిల్లు వద్ద లారీని ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన ఒగ్గు ఉదయ్‌కుమార్‌ను బైక్‌ను ఢీకొన్నారు. దీంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందగా సుధాకర్, ఉదయ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా వంశీకి ఇటీవల పెళ్లి కుదిరినట్లు తెలిసింది. వీరి స్వగ్రామం దేవరుప్పుల మండలం కాగా బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. పని నిమిత్తం బైక్‌పై దేవరుప్పులకు వస్తూ ప్రమాదానికి గురయ్యారు.


వంశీ (ఫైల్)

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు..

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీకి చెందిన ఆగోళ్ల తిరుపతమ్మ (92) గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. సీఐ సార్ల రాజు కథనం ప్రకారం తిరుపతమ్మ మంగళవారం తన ఇంటి ఎదుట శరీరం శుభ్రం చేసుకుంటోంది. ఈ క్రమంలో వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తిరుపతమ్మ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కూతురు కన్నెబోయిన లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

హసన్‌పర్తి: ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా వెనుక వైపు ఉన్న బైక్ అదుపు తప్పి కింద పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేయూ సీఐ అబ్బయ్య కథనం ప్రకారం నడికూడ మండలం ముస్త్యాలపల్లికి చెందిన బండెల శ్రీనివాస్ (35) తాపీ మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పనికుదుర్చుకున్నాడు. అప్పుడప్పుడు ముస్త్యాలపల్లి వచ్చేవాడు. ఈ క్రమంలో సోమవారం హైదరాబాద్‌కు వెళ్లడానికి సిద్ధమయ్యాడు. బైక్‌పై కాజీపేట రైల్వే స్టేషన్ వరకు దింపాలని సోదరుడు సాంబయ్యను కోరాడు. దీనికి సాంబయ్య సరేననగా ఇద్దరు కాజీపేటకు బయల్దేరారు. అయితే మార్గమధ్యలోని రామారం సమీపంలో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకవైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

కమలాపురం కన్నీటి పర్యంతం

● మూడు రోజుల అనంతరం ఇంటికి చేరిన మృతదేహాలు


మృతదేహాలను తీసుకువచ్చిన అంబులెన్స్


మంగపేట : శబరిమల యాత్రకు వెళ్లిన ముగ్గురు అయ్యప్ప భక్తులు నిర్జీవంగా ఇంటికి చేరడంతో కమలాపురం కన్నీటిపర్యంతమైంది. యాత్రకు వెళ్లిన భక్తుల పార్థివ దేహాలను చూసి గుండెలవిసేలా రోదించారు. ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన తలారి సుబ్బయ్య నాయుడు, నర్రా సాంబయ్య, కొట్టు రాజు(నిమ్మల) శబరిమలను దర్శించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో తమిళనాడు రాష్ట్రంలో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కడసారిగా తమ వారిని చూసుకోవాలని పుట్టెడు దుఃఖంతో మూడు రోజుల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. వీరి మృతదేహాలను మంగళవారం సాయంత్రం కమలాపురం గ్రామానికి తీసుకొచ్చారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో అయ్యప్ప మాలధారులు, భక్తులు, బంధువులు, స్నేహితులు వందలాదిగా తరలివచ్చి చివరిసారిగా చూసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, ఆక రాధాకృష్ణ, చింత పరమాత్మ, గుమ్మడి సోమయ్య తదితరులు పరామర్శించారు.

బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండ..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు చింతా పరమాత్మ అన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క వెంటనే స్పందించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ద్వారా అక్కడి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తక్షణ ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపట్టారని, మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి స్వస్థలాలకు తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు.

నేటినుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

● 1,83,942 మంది విద్యార్థులు హాజరు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని కళాశాలల్లో నేటి(బుధవారం) నుంచి డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీఒకేషనల్(యూజీ నాన్‌ప్రొఫెషనల్)మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి మంగళవారం తెలిపారు. డిగ్రీ కోర్సు మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 27, 29, జనవరి 2, 4, 8,10,12 తేదీల్లో మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21,23, 28,30, జనవరి 3, 5, 9, 11, 16, 18తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటవరకు నిర్వహిస్తారు. ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20, 22, 27, 29, జనవరి 2, 4, 8, 10, 12, 17, 19, 20, 22, 23, 24 తేదీల్లో ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12గంటలవరకు నిర్వహిస్తారని వారు తెలిపారు. కేయూ పరిధిలో మూడు ఉమ్మడి జిల్లాల్లో కలిపి ఆయా సెమిస్టర్లలో మొత్తంగా 1,83, 942 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 47, ఖమ్మంలో 30, ఆదిలాబాద్‌లో 45 మొత్తంగా 122 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు, 122 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, అన్నిసెంటర్లకు అబ్జర్వర్లను నియమించారు. మూడు ఉమ్మడి జిల్లాలో కలిపి 8 స్క్వాడ్ బృందాలను, యూనివర్సిటీ నుంచి ఒక స్పెషల్ స్క్వాడ్‌ను నియమించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: మల్లారెడ్డి

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి కోరారు. మంగళవారం యూనివర్సిటీ పరిధిలోని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన పలు సూచనలు చేశారు. యూనివర్సిటీకి తక్కువ దూరంలోని పరీక్షా కేంద్రాలవారు ఏ రోజుకు ఆ రోజే జవాబు పత్రాలను పంపాలన్నారు. దూరం ప్రాంతంలోని వారు తమకు సమీపంలోని నోడల్‌సెంటర్‌లో అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లోనే ప్రశ్నాపత్రాలు పంపుతామని డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈసమావేశంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, ప్రొఫెసర్ ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.